నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | శుక్రవారం 5 జూలై 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

చేపల వేటకు మరో ఆరు నెలల గడువివ్వాలి

- భీమారం మత్స్య పారిశ్రామిక సమితి డైరెక్టర్లు
- వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన

నీళ్ల ట్యాంక్ ఎక్కి నిరసన తెలుపుతున్న డైరెక్టర్లు

భీమారం, జూలై 4 : మంచిర్యాల జిల్లా భీమారం మండల కేంద్రంలోని గొల్లవాగు ప్రాజెక్ట్‌లో చేపలు పట్టేందుకు వేలం పాట నిర్వహిస్తే రూ. 49 లక్షలు చెల్లించి దక్కించుకున్నామని, లాభం లేక రూ. 10 లక్షల దాకా నష్టపోయామని, తమకు మరో ఆరు నెలల గడువు ఇవ్వాలని భీమారం మత్స్య పారిశ్రామిక సమితి డైరెక్టర్లు సుంకరి నర్సయ్య, సుంకరి దుర్గయ్య, పందుల మధు కోరారు. ఈ మేరకు గురువారం భీమారం మండల కేంద్రంలో మంచినీళ్ల ట్యాంక్ ఎక్కి నిరసన తెలిపారు. ప్రాజెక్టులో రూ. 10 లక్షల విలువైన సీడ్ సైతం పోశామని, గత నెల 26వ తేదీతో గడువు ముగిసిందని, కొత్త సొసైటీ సభ్యులు 10 మంది వచ్చి తమను చేపలు పట్టుకోకుండా అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయకుంటే ఆత్మహత్య చేసుకుంటామని బెదిరింపులకు పాల్పడ్డారు. ఎస్ఐ రాములు వారితో ఫోన్‌లో మాట్లాడి శాంతింపజేశారు. అనంతరం వారిని పోలీసులు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటించాలి

హెల్త్ ఆఫీసర్ లోక్‌నాథ్‌రెడ్డి

మాట్లాడుతున్న హెల్త్ ఆఫీసర్, డాక్టర్ లోక్‌నాథ్‌రెడ్డి

శ్రీరాంపూర్, జూలై 4 : కార్మికులు తమ ఆర్యోగంపై జాగ్రత్తలు పాటించాలని శ్రీరాంపూర్ ఏరియా హెల్త్ ఆఫీసర్, డాక్టర్ లోక్‌నాథ్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం శ్రీరాంపూర్ ఆర్కేన్యూటెక్ గనిపై వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సదస్సులో మేనేజర్ స్వామిరాజు, డాక్టర్ లోక్‌నాథ్ రెడ్డి మాట్లాడారు. వానకాలం నేపథ్యంలో కార్మికులు వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఇంటి ఆవరణలో మురుగు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి ఆకుల లక్ష్మణ్ పాల్గొన్నారు.

సిర్పూర్ మండలం మహాగాం ఆశ్రమ పాఠశాలలో పగిలిన తలుపు, చిరిగిన కిటికీ జాలీ

బడిలో భద్రమేనా..?

- సమస్యలతో సతమతమవుతున్న విద్యాలయాలు
- ఊడిన తరగతి గదుల తలుపులు, కిటికీలు
- వేలాడుతున్న విద్యుత్ వైర్లు.. పై కప్పులేని బావులు
- పిచ్చిమొక్కలు, చెత్తాచెదారంతో చిత్తడిగా ఆవరణలు
- వానకాలంలో తేళ్లు, పాములతో పొంచి ఉన్న ప్రమాదం
- భయం భయంగా చదువులు సాగిస్తున్న విద్యార్థులు

ప్రమాదకరంగా బావి

మహాగాం ఆశ్రమ పాఠశాల ఆవరణలో పెరిగిన గడ్డి

జైనూర్ : రక్షణలేని డార్మెట్రీ

కుమ్రం భీం ఆసిఫాబాద్, జూలై 4 (నమస్తే తెలంగాణ) : జిల్లాలోని సర్కారు బడులతో పాటు ఆశ్రమాలు, రెసిడెన్షియల్స్, వసతిగృహాలు సమస్యలతో సతమతమవుతున్నాయి. ఊడిన తలుపులు, కిటికీలు.. వేలాడుతున్న విద్యుత్ వైర్లు.. పై కప్పులేని బావులు, కూలిన ప్రహరీలు, తెరచి ఉన్న నీటి సంపులు, పిచ్చిమొక్కలతో చిత్తడిగా మారిన ఆవరణలు.. ఇలా ఒకటేమిటి అనేక సమస్యలతో ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి. వానకాలం కావడంతో పాములు, తేళ్లతో పాటు విషపురుగులు సంచరించే అవకాశముండగా, విద్యార్థులు, ఉపాధ్యాయులు భయంభయంగా గడపాల్సిన దుస్థితి దాపురించింది.

అధికారుల పట్టింపేదీ?

జిల్లాలో గిరిజన సంక్షేమ ఆశ్రమాలతో పాటు బీసీ, ఎస్సీ రెసిడెన్షియల్ పాఠశాలలు, వసతి గృహాలు దాదాపు 80 వరకు ఉండగా, దాదాపు 18 వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. విద్యాసంస్థల ప్రారంభానికి ముందే సౌకర్యాలపై దృష్టి సారించాల్సిన అధికారులు, ఆ వైపు కన్నెత్తి చూడకపోవడం వల్ల ఇలాంటి పరిస్థితులు తలెత్తాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధానంగా ఆశ్రమాలు, రెసిడెన్షియల్స్, వసతిగృహాల్లో డార్మెట్రీలు.. మొదలుకొని టాయిలెట్స్, స్నానాల గదులు, వంటశాలలు, చివరికి తరగతి గదుల్లో కూడా విద్యార్థులకు భద్రత కొరవడుతున్నది. రాత్రింబవళ్లూ భయాందోళనల నడుమ చదువులు సాగించాల్సి వస్తున్నదని పలువురు విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల సిర్పూర్(టీ) మండలం అచ్చంపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలోని నీటి సంపు వద్ద మూడో తరగతి విద్యార్థిని దర్శితను పాము కాటు వేయగా, స్థానికుల సకాలంలో స్పందించడం వల్ల ప్రాణాపాయం తప్పింది. గతంలోనూ ఇలాంటి ఘటనలు అనేకం ఉన్నాయి. కాగా, ప్రస్తుతం విద్యాలయాలు అధ్వానంగా మారాయనడానికి 'నమస్తే తెలంగాణ' తీసిన ఈ చిత్రాలే నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఈ విషయమై జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి రమాదేవిని వివరణ కోరేందుకు యత్నించగా, అందుబాటులోకి రాలేదు.

జైనూర్ మండలం పోచంలొద్ది ఆశ్రమంలో రక్షణలేని డార్మెట్రీ

జిల్లా కేంద్రంలోని ఎస్సీ బాలుర రెసిడెన్షియల్ పాఠశాలలో ప్రమాదకరంగా విద్యుత్ ప్యూజులు

సంపూర్ణత అభియాన్
లక్ష్యాలను సాధిద్దాం

- ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే
- వివిధ శాఖల అధికారులతో సమీక్ష

మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జూలై 4 : జిల్లాలో నీతి ఆయోగ్ సంపూర్ణత అభియాన్ లక్ష్యాలను సమన్వయంతో సాధిద్దామని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారీ, సిర్పూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు, జిల్లా అటవీ శాఖ అధికారి నీరజ్‌కుమార్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్‌తో కలిసి వివిధ శాఖల జిల్లా అధికారులు, ఉపాధ్యాయులతో నీతి ఆయోగ్ సంపూర్ణత అభియాన్ లక్ష్యాల సాధనపై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నీతి ఆయోగ్‌లో భాగంగా వెనుకబడిన ప్రాంతాల్లో ఆరోగ్యం, విద్య, వైద్యం, వ్యవసాయం, స్వయం సహాయక సంఘాల అభివృద్ధి, మహిళలు, శిశువుల సంక్షేమం.. తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. సంపూర్ణత అభియాన్‌లో జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేందుకు అధికారులు సమష్టిగా కృషి చే యాలని కోరారు. గర్భం దాల్చిన మహిళల వివరాలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రా లు, ప్రభుత్వ హాస్పిటల్స్‌లో నమోదు చేయాలని, ప్రతి నెలా సమయానుసారంగా పరీక్షలు చేయించుకొని, పౌష్టికాహా రం, మందులు సకాలంలో తీసుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. డయాబెటిస్, హైపర్ టెన్షన్‌వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు దవాఖానలకు వెళ్లి పరీక్షలు చేయించుకునేలా అధికారులు వివరించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకు పోషక విలువలు కలిగిన ఆహారం అందించాలని, గర్భస్థ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేయాలని సూ చించారు. ప్రతి రైతు భూసార పరీక్షలు చేయించుకొని కార్డులు పొందాలని, ఆ నివేదిక ఆధారంగా సాగు చేయాల్సిన పం టలపై రైతులకు మెళకువలు అందిస్తారని చెప్పారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఆధ్వర్యంలో విద్యార్థులకు సకల సౌకర్యాలతో కూడిన నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. మహిళా శక్తి పథకం ద్వారా స్వయం సహాయక సంఘాలకు చేయూతనందిస్తామని పేర్కొన్నారు. అనంతరం జిల్లా గ్రా మీణా అభివృద్ధి, విద్య, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. వైద్య శిబిరంలో స్వయం గా బీపీ పరీక్ష చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి తుకారాం, జడ్పీటీసీలు నాగేశ్వర్‌రావు, శ్రీరామరావు, సంతోష్, డీఎంహెచ్‌వో తుకారాం, జిల్లా సంక్షేమశాఖ అధికారి భాస్కర్, జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ ఏపీడీ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను పాఠశాలల్లో చేర్పించండి

మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

పాఠశాలల్లో మొక్క నాటుతున్న మంచిర్యాల కలెక్టర్

లక్షెట్టిపేట, జూలై 4: పిల్లలంతా బడికి వచ్చేలా చూడాలని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను, ఉపాధ్యాయులను ఆదేశించారు. గురువారం బలరావుపేట గ్రామంలో ఆయన ఆకస్మికంగా పర్యటించారు. ఇటీవల ఎంపికైన అమ్మ ఆదర్శ పాఠశాలలో చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ కలెక్టర్ మాట్లాడుతూ పనుల్లో నాణ్యత ఉండాలని, త్వరతగతిన పనులు పూర్తి చేసి అప్పగించాలన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా ప్రతీ పిల్లాడు బడికి వచ్చేలా అధికారులు, ఉపాధ్యాయులు, నాయకులు పిల్లల తల్లితండ్రులకు అవగాహన కల్పించాలని చెప్పారు. ఉపాధ్యాయులు కూడా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలని సూచించారు. బాల కార్మికులుంటే వెంటనే గుర్తించి వాళ్ల తల్లితండ్రులకు కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు వారిన బడిలో చేర్పించాలన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం పోషక విలువలు గల ఆహారం అందజేయాలని సిబ్బందికి సూచించారు. అలాగే గ్రామంలో పర్యటించి పారిశుధ్య పనులు, తాగునీటి సౌకర్యం గురించి ప్రజలను అడిగితెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణలో వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి అజ్మత్, పంచాయతీ సెక్రటరీ శృతి, ఈజీఎస్ ఏపీవో వెంకటరమణ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామస్వామి, కారోబార్ శ్రీనివాస్, టీఏ రాజన్న పాల్గొన్నారు.

డెంగ్యూను నివారిద్దాం

పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్, డీఎంహెచ్‌వో

మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, జూలై 4 : డెంగ్యూ నివారణ చర్యలను మన ఇంటి నుంచే మొదలు పెడుదామని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో డీఎంహెచ్‌వో అనిత, జిల్లా సంక్షేమాధికారి చిన్నయ్య, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు, ఆర్ ఎంవో భీష్మ, జిల్లా సర్వేయ్‌లెన్స్ అధికారి ఫయాజ్, వైద్యాధికారి స్వస్తిక జైశ్వాల్‌తో కలిసి ఆయా శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ అంటు వ్యాధులు, విష జ్వరాలు ప్రబలకుండా మున్సిపాలిటీలు, గ్రామాపంచాయతీల్లో ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. జ్వరం, మలేరియా సంబంధిత వ్యాధి గ్రస్తులు వచ్చిన సమయంలో వారి వివరాలతో నివేదిక సమర్పించడంతో పాటు వారి నివాస ప్రాంతాల్లో దోమలు వృద్ధి చెందకుండా నివారణ చర్యలు చేపట్టాలన్నారు. డెంగ్యూ నివారణలో భాగంగా ఈ నెల 31 వరకు డెంగ్యూ మాసోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నివాస ప్రాంతాలు, అంతర్గత రహదారులు, మురుగు కాలువల్లో నీరు నిల్వ లేకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని, అవసరమున్న చోట ఆయిల్ బాల్స్ పిచికారీ చేయడం ద్వారా దోమల వృద్ధిని అరికట్టాలన్నారు. వరద ప్రభావిత లోతట్టు ప్రాంతాలపై ఎప్పటికప్పుడు దృష్టి సారించాలని, ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని సూచించారు. అతిసారం వ్యాప్తి చెందకుండా వసతి గృహాల్లో తగు చర్యలు చేపట్టాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, డెంగ్యూ జ్వరాల నియంత్రణపై కళాజాత ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. వైద్యాధికారులు, పారా మెడికల్ సిబ్బందికి కీటక జనిత వ్యాధుల నియంత్రణపై శిక్షణ అందించారు. అనంతరం కార్యక్రమం సంబంధిత పోస్టర్లను విడుదల చేశారు.

ఆర్డీవో కార్యాలయ చరాస్తుల జప్తు వాయిదా

విలేకరులతో మాట్లాడుతున్న సీనియర్ న్యాయవాదులు

కాగజ్‌నగర్, జూలై 4 : కాగజ్‌నగర్ ఆర్డీవో కార్యాలయ చరాస్తుల జప్తు రెండు నెలలు వాయిదా పడింది. దహెగాం మండలంలోని పీపీరావు ప్రాజెక్టులో భూములు కోల్పోయిన బాధితులకు నష్టపరిహారం చెల్లించకపోవడంతో ఆసిఫాబాద్ కోర్టు సినియర్ సివిల్ జడ్జి యువరాజ ఆర్డీవో కార్యాలయ చరాస్తులు, వాహనాలు జప్తు చేయాలని గత నెల 27న ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు కోర్టు ఆదేశాలతో కరీంనగర్ న్యాయవాదులు మండల విక్రమ్‌రెడ్డి, గంట శ్రీనివాస్, రాజయ్య గురువారం ఆర్డీవో కార్యాలయ చరాస్తులు, వాహనాలు జప్తు చేసేందుకు వచ్చారు. ఆర్డీవో సురేశ్ కార్యాలయంలో అందుబాటులో లేరు. అనంతరం కార్యాలయ చరాస్తులు జప్తు చేయాడానికి సిద్ధమవుతున్న తరుణంలో సిబ్బంది ఆర్డీవోకు సమాచారం అందించారు. ఆయన కార్యాలయానికి చేరుకొని వారితో చర్చలు జరిపారు. ఆర్డీవో సురేశ్ ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి బాధిత రైతులకు రావాల్సిన పరిహారం రెండు నెలల్లో చెల్లించేలా చర్యలు తీసుకుంటానని ఆర్డీవో రాతపూర్వకంగా హామీ ఇచ్చారని న్యాయవాదులు తెలిపారు.

24 మంది రైతులకు..

కాగజ్‌నగర్ డివిజన్‌లోని దహెగాం మండలం హత్తిని గ్రామానికి చెందిన 24 మంది రైతులు పీపీరావు ప్రాజెక్టు నిర్మాణంలో భూములు కోల్పోయారు. సకాలంలో నష్టపరిహారం అందకపోవడంతో 2007లో హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు 2010లో హైకోర్టు ఎకరానికి రూ. లక్ష చొప్పున పరిహారం చెల్లించాలని తీర్పునిచ్చింది. మొత్తం 132 ఎకరాలకు పరిహారం రావాల్సి ఉంది. పరిహారం అందకపోవడంతో రైతులు మరోసారి హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేయడంతో 27.03.2023న నష్టపరిహారం చెల్లించాలని కోర్టు ఆదేశించిన విషయం విదితమే.

నో టీసులివ్వకుండా ఇల్లెలా కూల్చారు

- న్యాయం చేయకుంటే విషం తాగుతాం
- మున్సిపల్ కార్యాలయం ఎదుట బాధితుల ధర్నా

అక్రమంగా తమ ఇల్లు కూల్చి వేశారని మున్సిపల్ ఆఫీస్ ఎదుట ధర్నా చేస్తున్న బాధితులు

శ్రీరాంపూర్, జూలై 4 : 'నోటీసులివ్వకుండా ఇల్లెలా కూల్చేశారు.. తమకు న్యాయం చేయకుంటే విషం తాగుతాం' అంటూ మంచిర్యాల జిల్లా నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరాంపూర్‌లో గల ఠాగూర్‌నగర్‌కు చెందిన గొల్లె దశరథం కుమార్, కుమారులు తిరుపతి, భానుచందర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం నస్పూర్ మున్సిపల్ కార్యాలయం ఎదుట మందు డబ్బాతో కుటుంబ సభ్యులతో కలిసి ధర్నాకు దిగారు. వారు మాట్లాడుతూ ఠాగూర్‌నగర్‌లోని సర్వే నంబర్ 45లో తమ వారసత్వంగా వస్తున్న 11 గుంటల్లో నిర్మించుకున్న ఇంటిని కూల్చివేశారని, తమకు న్యాయం చేయకుంటే విషం తాగి ఆత్మహత్య చేసుకుంటామని బెదిరించారు. దీంతో మున్సిపల్ అధికారులు పోలీసులకు సమాచారమివ్వగా, వారు వచ్చి ఆందోళనకారులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. విధులకు ఆటంకం కలిగించారని మున్సిపల్ కమిషనర్ సతీశ్ ఫిర్యాదు మేరకు ఆందోళన చేసిన వారిపై భారత న్యాయ సంహిత సెక్షన్ 221(బీఎన్ఎస్), 126 క్లాస్(2) సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవికుమార్ పేర్కొన్నారు.

లాటరీ టెండర్లపై ఎమ్మెల్యే సీరియస్

మున్సిపల్ టెండర్లు రద్దు

మంచిర్యాలటౌన్, జూలై 4: మున్సిపాలిటీ టెండర్లలో దక్కించుకోవాల్సిన పనులకు లాటరీ నిర్వహించిన ఘటనపై ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ మేరకు ఆయన మున్సిపల్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతూ ఉన్నఫలంగా టెండర్లను రద్దుచేసి నిబంధనల ప్రకారం మళ్లీ నిర్వహించాలని ఆదేశించారు. తమకు కావాల్సిన వారికి పనులు అప్పగించడం కోసం లాటరీ పద్ధతి నిర్వహించిన వారిపైనా ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తినట్లు తెలుస్తోంది. ఇలాంటి ఘటనలు పునరావృతం కావద్దంటూ హెచ్చరించినట్లు సమాచారం.

మున్సిపల్ టెండర్లు రద్దు

మంచిర్యాల మున్సిపాలిటీలో రూ. రెండు కోట్ల అంచనా వ్యయంతో 45 పనులకు జూన్ 28న పిలిచిన టెండర్లను రద్దు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ మారుతీ ప్రసాద్ తెలిపారు. జనరల్ ఫండ్‌నుంచి చేపట్టే ఈ పనులకు సంబంధించి టెండర్ల దాఖలుకు ఈ నెల ఐదో తేదీ చివరిగడువు. కాగా, బుధవారం మున్సిపల్ చైర్మన్ ఉప్పలయ్య, వైస్‌చైర్మన్ మహేశ్ ఆధ్వర్యంలో పలువురు కౌన్సిలర్లు, కాంట్రాక్టర్లు కూడబలుక్కుని పనులను లాటరీ పద్ధతిన పంచుకున్నారు. ఏ వార్డులో ఏ కాంట్రాక్టరు పనిచేయాలని ముందే నిర్ణయించుకొని.. సంబంధిత కౌన్సిలర్లు వారికి అనుకూలంగా ఉండే కాంట్రాక్టర్లకు పనులు దక్కేలా చూసుకున్నారు. ఈ విషయంలో పత్రికల్లో ప్రచురితం కావడంతో అధికారులు టెండర్లు రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు.

- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం
- మరియు
- అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...
నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..
ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571
మంచిర్యాల జిల్లా : 9182 777 676
కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా : 9182 777 679